నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, గురువారం 5 సెప్టెంబర్ 2024 | SIDDIPET

మహిళలకు మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్

- సిద్దిపేట ఐఎంఏ రూ.లక్ష, అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి 500 కిట్ల గ్రాసరి కిట్ల పంపిణీ
- సిద్దిపేట నుంచి గురువారం 6 లారీల్లో సరుకుల తరలింపు
- ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి పోతే దాడులకు పాల్పడ్డ కాంగ్రెస్ నేతలు
- హామీలు విస్మరించిన సీఎం.. రేవంత్‌కు పాలనపై పట్టులేదు
- సిద్దిపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

ఖమ్మం వరద బాధితులను ఆదుకోవడానికి సిద్దిపేట వాసులు ముందుకు రావడం అభినందనీయం

మట్టి గణపతుల పంపిణీ సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 4: కాంగ్రెస్ సర్కారు సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్నదని, ఈ ప్రాంతానికి మంజూరైన పలు పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి తన కొడంగల్ నియోజకవర్గానికి తరలించుకుపోయి అన్యాయం చేస్తున్నాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేటలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 190మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. సిద్దిపేటలో అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. డెంగీ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ..ఖమ్మం వరద బాధితులకు సహాయం చేద్దామని పోతే కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడడం తగదన్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో సిద్దిపేట రూపురేఖలు మార్చుకున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సిద్దిపేటకు మంజూరైన కాలేజీని కొడంగల్‌కు తరలించుకుపోయాడని విమర్శించారు. అవసరమైతే కొడంగల్‌కు నూతన కాలేజీని మంజూరు చేసుకోవాలని, సగంవరకు పనులు చేపట్టిన మన కాలేజీని గద్దలా తన్నుకుపోయాడన్నారు. కోమటి చెరువు వద్ద నిర్మిస్తున్న శిల్పారామం పనులను నిలిపివేశాడన్నారు. సిద్దిపేట అభివృద్ధికి ఊపిరి ఉన్నంత వరకు కృషి చేస్తానని హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటను విద్యాక్షేత్రంగా తీర్చిదిద్దానన్నారు.

విరాళాలు అభినందనీయం...

ఖమ్మం వరద బాధితులను ఆదుకునేందుకు సిద్దిపేట అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి ముందుకు రావడం అభినందనీయం అని హరీశ్‌రావు అన్నారు. వీరి ఆధ్వర్యంలో గురువారం ఉదయం లారీల్లో 500 నిత్యావసర గ్రాసరి కిట్లు, ఇతర సామన్లు ఖమ్మం తరలించనున్నట్లు తెలిపారు. సిద్దిపేట పట్టణ ఐఎంఏ తమ వంతు సహాయంగా రూ.లక్ష విరాళం అందజేసిందన్నారు. సిద్దిపేటకు చెందిన చాలామంది వ్యాపారులు తమ వంతు సహాయంగా వస్తువులు, నిత్యావసర సరుకులు ఇవ్వడానికి ముందుకు వచ్చారన్నారు. సిద్దిపేటకు చెందిన వ్యాపార వేత్త ఉప్పల కృష్ణమూర్తి రూ.11వేలు, సిద్దిపేట ధార్మిక ఉత్సవ సమితి రూ.25,116, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ రూ.11వేలు, సిద్దిపేట మున్సిపల్ కౌన్సిలర్లు తమ నెల వేతనం వరద బాధితులకు ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. ఆపద సమయంలో సేవ, సాయం చేయడానికి రాజకీయాలు వద్దన్నారు. ఎవరికి వారు తోచిన విధంగా సహాయం అందించాలని మాజీమంత్రి హరీశ్‌రావు కోరారు.

ఐఎంఏ వైద్యుల అండ

ఖమ్మం వరద బాధితులను ఆదుకోవడానికి సిద్దిపేట ఐఎంఏ వైద్యులు ముందుకు వచ్చి రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే హరీశ్‌రావుకు బుధవారం క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు భాస్కర్‌రావు, సతీష్, శ్రీనివాస్, రజనీకాంత్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం..

సిద్దిపేట అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. 13 ఏండ్లుగా అమర్‌నాథ్ యాత్రికులకు అన్నదానం చేస్తున్నారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారన్నారు. అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో 10 వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేశామన్నారు. సిద్దిపేట ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నెలవు అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి అధ్యక్షుడు కోర్తివాడ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నేతి కైలాసం, కోశాధికారి తిప్పరాజు మధుసూదన్, పీఆర్వో కుమ్మరికుంట రమేశ్, మీడియా ఇన్‌చార్జి గ్యాదరి పరమేశ్వర్, కౌన్సిలర్లు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే హరీశ్‌రావుకు అందజేస్తున్న సిద్దిపేట ఐఎంఏ వైద్యులు

బాధితులకు సీఎమ్‌ఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

బాధితులతో మాట్లాడుతున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ

వరద బాధితులను ఆదుకుంటాం

సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

నంగునూరు, సెప్టెంబర్ 4: అధిక వర్షాల కారణంగా ముంపునకు గురై రైతువేదికలో తాత్కాలికంగా ఆశ్రయం పొందుతున్న బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. అక్కెనపల్లిలో రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన తాత్కాలిక శిబిరంలో ఆశ్రయం పొందుతున్న 23 కుటుంబాలకు చెందిన 53 మంది వరద బాధితులను బుధవారం సీపీ అనురాధతో కలిసి కలెక్టర్ మను చౌదరి పరామర్శించారు. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. బాధితులకు శాశ్వత గృహాలు నిర్మించేందుకు ప్రజాపాలన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను పరిశీలిస్తామని తెలిపారు. వైద్యాధికారులను పంపి అందరికీ వైద్యపరీక్షలు చేపిస్తామని, ఆహారం, ఇతర అవసరాలకు ఎలాంటి ఇబ్బంది కాకుండా ఏర్పాట్లు చేయాలని, బాధితుల పూర్తి వివరాలతో త్వరగా పూర్తి నివేదిక, ప్రతిపాదనలు పంపాలని తహసీల్దార్ సరితను ఆదేశించారు. చెరువు బ్యాక్ వాటర్‌తో ఇండ్లు ఎఫెక్ట్ అవుతున్నందున చెరువులో వాటర్ తగ్గించే ఏర్పాటును పరిశీలించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు.

మెడికల్ కళాశాల కోసం అప్పీల్‌కు వెళ్లాం

- మెడిక్ ఏరియా దవాఖానలో బెడ్ల సంఖ్య పెంచుతాం
- రెవెన్యూ దరఖాస్తులపై సమగ్రంగా విశ్లేషించాలి
- విద్య, వైద్యం బలోపేతం కావాలి
- మెడిక్‌లో మీడియా సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ

మెడిక్‌లో మాట్లాడుతున్న మంత్రి దామోదర

మెదక్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): మెదక్ మెడికల్ కళాశాలకు అనుమతులకు సంబంధించి అప్పీల్‌కు వెళ్లామని, అనుమతి వస్తుందని ఆశిస్తున్నామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం మెదక్ కలెక్టరేట్‌లో అభివృద్ధి, సంక్షేమంపై రివ్యూ సమావేశాం అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. విద్య, వైద్యం, వ్యవసాయం, రుణమాఫీపై సమీక్ష చేశామన్నారు. ఉన్నత ప్రమాణలాతో కూడిన విద్యను అందించాలని, అసంపూర్తిగా ఉన్న సబ్ సెంటర్లను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించామన్నారు. ఏరియా దవాఖానలో బెడ్ల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్న ట్లు తెలిపారు. రెవెన్యూ దరఖాస్తులపై సమగ్రంగా విశ్లేషించాలని ఆదేశించామన్నారు. మెదక్ మెడికల్ కళాశాలకు సంబంధించి అప్పీల్‌కు వెళ్లామని, తప్పక అనుమతి వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. సర్కారు స్కూల్స్‌లో కనీస సామర్థ్యాలు పెరగాలని, పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉన్నదన్నారు. ప్రతినెలా వైద్యం, విద్యపై రివ్యూ నిర్వహించాలన్నారు. విద్యా, వైద్యానికి నిధులు కేటాయించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అమ్మాయిలు చదువుకు అన్ని సౌకర్యాలు కల్పించే బాధ్యత ప్రభుత్వం పైన ఉన్నదని తెలిపారు. విద్య, వైద్యంపై కలెక్టర్ టాస్క్‌ఫోర్స్ కమిటీ వేయాలన్నారు. ఫీల్డ్ విజిట్ చేసి భూమి సేకరించాలని, కొత్త పీహెచ్‌సీలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ వైద్య శాఖపై చేస్తున్న కృషి అభినందనీయమని, అక్కడ ఎలా పనిచేస్తున్నారో తెప్పించుకోండి అని మంత్రి సూచించారు. రెవెన్యూ శాఖ అడ్మినిస్ట్రేషన్‌కు గుండెకాయ లాంటిదని, అధికారులు, ఉద్యోగులు కమిట్మెంట్‌తో పనిచేసి జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మైనంపల్లి రోహిత్, సునీతారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో కలసి ప్రాజెక్టును సందర్శిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్

సింగూరుకు పోటెత్తిన వరద

పుల్కల్, సెప్టెంబర్ 4: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి వరద అంతకంతకూ పెరుగుతున్నది. నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు వద్దే ఉంటూ ఎప్పటికప్పుడు నీటి మట్టాన్ని పరిశీలిస్తున్నారు. ఐదు రోజుల్లో ప్రాజెక్టులోకి 10 టీఎంసీల వరద వచ్చింది. వరద తీవ్రత ఇలాగే కొనసాగితే మరో రెండు రోజుల్లో ప్రాజెక్టు పూర్తిగా నిండే అవకాశం ఉన్నట్లు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. ఎగువ ప్రాంతాలైన కర్ణాటక, సైగామ్ ప్రాంతాల్లో ఆశించిన వర్షాలు లేక కొద్దిరోజుల వరకు వరద బాగా రాలేదు. నాలుగు రోజులుగా అల్పపీడన ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకే వరద భారీగా వస్తున్నది. దీంతో సందర్శకులను ప్రాజెక్టుపైకి అనుమతించడం లేదు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 25.894 టీఎంసీలకు చేరింది. 44 289 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 401క్యూసెక్కులు వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. ట్రైనీ కలెక్టర్ మనోజ్ బుధవారం ప్రాజెక్టును సందర్శించి డీఈ నాగరాజును అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఇల్లు కూలి వృద్ధురాలికి తీవ్ర గాయాలు

ఖాజీపూర్‌లో కూలిన దుబ్బా రెడ్డి ఇల్లు

మిరుదొడ్డి(అక్బర్‌పేట-భూంపల్లి), సెప్టెంబర్ 4: వర్షాల కారణంగా అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని ఖాజీపూర్‌లో బుధవారం దార దుబ్బారెడ్డి ఇల్లు కూలిపోయింది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న వృద్ధురాలు కౌసల్య తీవ్రంగా గాయపడింది. వృద్ధురాలు ప్రాణాపాయ స్థితికి చేరడంతో వెంటనే చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు.

గోపులాపూర్‌లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

నారాయణరావుపేట, సెప్టెంబర్ 4: పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నారాయణరావుపేట మండలంలోని గోపులాపూర్‌లో తురకవాని కుంట తెగి రైతు దేవయ్యకు చెందిన 2 ఎకరాల పంట పొలం నష్టపోయింది. బుధవారం హరీశ్‌రావు రైతు పొలాన్ని పరిశీలించారు. ఆందోళన చెందవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తక్షణ సహాయం కింద రూ.10 వేలు అందజేశారు. మండలంలో గోపులాపూర్, మల్యాల, జక్కాపూర్ తదితర గ్రామాల్లో పంట నష్టం జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని, మొత్తంగా నియోజకవర్గంలో 700 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తెలిపారు. రెండు కిలోమీటర్ల మేర బైక్‌పై, కిలోమీటర్ మేర పొలం గట్టుపై రైతుల వద్దకు వెళ్లి హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. కష్టకాలంలో, ఆపదలో తమ దగ్గరకు వచ్చి అండగా ఉండి ఆర్థిక సహాయం అందించిన హరీశ్‌రావుకు రుణపడి ఉంటామని రైతు దేవయ్య సంతోషం వ్యక్తం చేశారు.

మీడియాతో మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి, పక్కన కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతారెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి

దాడి హేయమైన చర్య

- వరదలను రాజకీయం చేస్తున్న కాంగ్రెస్
- తూతూమంత్రంగా ఖమ్మం వరద బాధితులను పరామర్శించిన సీఎం, మంత్రులు
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి
- ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లాలో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావు బృందంపైన కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్య అని బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఖమ్మంలో బీఆర్‌ఎస్ ప్రతినిధులపై జరిగిన దాడిని ఖండిస్తూ బుధవారం మెదక్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డిలతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ వరదలను రాజకీయం చేస్తున్నదని మండిపడ్డారు. వరద బాధితులను పరామర్శించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రతినిధుల బృందం ఖమ్మం జిల్లాకు వెళ్తే అక్కడ కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ ప్రతినిధులపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వం కేసీఆర్‌ను నిందించడమే పనిగా పెట్టుకుందన్నారు. ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ..బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు వరద బాధితులకు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఒక నెల వేతనాన్ని విరాళంగా అందిస్తున్నామని ప్రకటించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఖమ్మం వెళ్లి తూతూమంత్రంగా వరద బాధితులను పరామర్శించి వచ్చారు తప్ప వారిని ఆదుకోలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ బృందం మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ వారి కష్టాలు తెలుసుకున్నారని, వారి ఇబ్బందులు గమనించి అత్యవసరంగా నిత్యావసరాలు అందజేశారని గుర్తుచేశారు. దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... అధికారంలో ఉన్నప్పుడు వరద బాధితులను ఏ విధంగా ఆదుకున్నామో అదేవిధంగా సహాయం చేయాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్న వారు పరామర్శిస్తుంటే దాడి చేయడాన్ని ప్రజలు చీదరించుకుంటున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ...వాతావరణ శాఖ హెచ్చరిక చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసి ఇంత విపత్తుకు కాంగ్రెస్ ప్రభుత్వం కారణమైందని విమర్శించారు. సమావేశంలో బట్టి జగపతి, లావణ్యరెడ్డి, లింగారెడ్డి, జుబేర్ అహ్మద్, కండెల సాయిలు, జయరాజు, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, బాలాగౌడ్, లింగం, జగన్, నరేందర్ రెడ్డి, రంజా, ఇస్మాయిల్, మోహన్, నవీన్, అమీర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఏనాడైనా అండగా ఉన్నది హరీశ్‌రావే..

అక్కెనపల్లి బుడగ జంగాల కుటుంబాలకు సరుకులు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- విపత్తును కొంతమంది రాజకీయం చేస్తున్నరు..
- సిద్దిపేట జిల్లా అక్కెనపల్లిలో బీఆర్‌ఎస్ నేతలు
- బుడగజంగాల కుటుంబాలకు అండగా నిలిచిన నేతలు
- హరీశ్‌రావు పంపిన నిత్యావసరాలు అందజేత

నంగునూరు, సెప్టెంబర్ 4: సిద్దిపేట నియోజకవర్గం హరీశ్‌రావు కుటుంబమని, ఆయన నాయకుడు కాదు.. సిద్దిపేట ప్రజల కుటుంబ సభ్యుడని, ప్రజా సేవకుడని.. కొంత మంది విపత్తును కూడా రాజకీయం చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. అకాల వర్షానికి నంగునూరు మండలంలోని అక్కెనపల్లి బుడగ జంగాల కాలనీలో కొన్ని ఇండ్లలోకి, గుడిసెలకు నీళ్లు రావడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు వారిని పరామర్శించి విషయాన్ని మాజీమంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే బీఆర్‌ఎస్ మండల నాయకులతో నిత్యావసర సరుకులు హరీశ్‌రావు పంపించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ..హరీశ్‌రావు కృషితోనే బుడగ జంగాల కాలనీలో గతంలో డ్రైనేజీ నిర్మించుకున్నామని, నేడు అకాల వర్షాలకు నష్టం జరగడం దురదృష్టకరం అన్నారు. కొంతమంది విపత్తును రాజకీయం చేస్తూ పబ్బం గడుపుతున్నారని, నాడైనా, నేడైనా ఆపదలో ఆదుకునేది కేవలం హరీశ్‌రావు మాత్రమే అని అన్నారు. నష్టం జరిగిన వారి కుటుంబాలతోపాటు బుడగ జంగాల కాలనీ వాసులకు మొత్తంగా 35 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు కోల రమేశ్ గౌడ్, ఎల్లంకి మహిపాల్‌రెడ్డి, కిష్టారెడ్డి, సారయ్య, తిరుపతి, వెంకటేశం పాల్గొన్నారు.

వర్షాలతో జలకళ

- 25 టీఎంసీలకు చేరిన సింగూరు ప్రాజెక్టు
- అలుగు పారుతున్న నల్లవాగు
- మత్తడి దుంకుతున్న చెరువులు

వట్‌పల్లి : ఖాదిరాబాద్‌లో అలుగుపారుతున్న మైనోద్దీన్ కుంట(పెద్ద చెరువు)

సంగారెడ్డి, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): వర్షాలకు జలవనరులు కళకళలాడుతున్నాయి. వరద వస్తుండడంతో సింగూరు ప్రాజెక్టు నీటిమట్టం 25.894 టీఎంసీలకు చేరుకుంది. వరద ఇలాగే కొనసాగితే ఈ ప్రాజెక్టు నిండే అవకాశాలు ఉన్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 29.917 టీఎంసీలు కాగా, మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటున్నది. వారం క్రితం వరకు ప్రాజెక్టు నీటిమట్టం 14.612 టీఎంసీలు ఉండే, వర్షాకాలంలో సైతం ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పట్టడంతో రైతుల్లో ఆందోళన చెందారు. ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలకు సింగూరు ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తున్నది. బుధవారం ప్రాజెక్టులోకి 46,604 క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం 25.420 టీఎంసీలకు చేరుకుంది. సింగూరు ప్రాజెక్టు నిండితే సాగు, తాగునీటి కష్టాలు తీరనున్నాయి. జిల్లాలోని మరో ప్రాజెక్టు నల్లవాగు అలుగు పారుతోంది. నల్లవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 0.746 టీఎంసీ కాగా, ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తిగా నిండి అలుగు పారుతోంది.

మత్తడి దుంకుతున్న చెరువులు

వర్షాలతో సంగారెడ్డి జిల్లాలోని చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. జిల్లాలో బుధవారం 2.8 సెం.మీటర్ల సాధారణ వర్షపాతం నమోదైంది. సంగారెడ్డిలో అత్యధికంగా 6.5 సెం.మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని 12 మండలాల్లో సాధారణం కంటే అధిక వర్షం కురవగా 13 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. వర్షాలతో జిల్లాలోని చెరువులు కుంటలు నిండుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 1769 చెరువులు ఉండగా, 147 చెరువులు మత్తడి దూకుతున్నాయి. 373 చెరువులు పూర్తిగా నిండాయి. 309 చెరువులు 75 శాతం నీటితో నిండగా 820 చెరువులు 50 శాతం నీటితో నిండాయి. వర్షాలు మరి కొన్ని రోజులు కొనసాగితే జిల్లాలోని చెరువులు పూర్తిగా నీటితో నిండనున్నాయి.

పంటలు వర్షార్పణం

- సంగారెడ్డి జిల్లాలో 2వేల ఎకరాల్లో పంటనష్టం
- 815 ఎకరాల్లో దెబ్బతిన్న సోయాబీన్
- పరిహారం చెల్లించాలని కోరుతున్న రైతులు

వట్‌పల్లి : మండలంలోని షాద్‌నగర్‌లో దెబ్బతిన్న పెసర పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

సంగారెడ్డి, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): వరుణుడు సంగారెడ్డి జిల్లా రైతులకు పరీక్ష పెడుతున్నారు. సాగు సీజన్‌లో వర్షాలు కురవక పంటలు సాగు చేయలేని పరిస్థితి. ఇప్పుడు వర్షాలతో పంటలు నీటిపాలు అవుతున్నాయి. ఈ ఏడాది వానకాలం సీజన్ సంగారెడ్డి జిల్లా రైతాంగానికి నష్టాన్ని మిగులుస్తున్నది. సీజన్ ఆరంభంలో వర్షాలు కురవక సాగుపై తీవ్ర ప్రభావం పడింది. ఇప్పుడు పంటలు నీటమునిగి రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది. ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలకు సంగారెడ్డి జిల్లాలో 2వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

వర్షాల లేమితో తగ్గిన పంట విస్తీర్ణం..

గతేడాది వానకాలంలో 7 లక్షల ఎకరాలకు పైగా పంటలు సాగు కాగా, ఈ ఏడాది కేవలం 5,36,254 ఎకరాల్లో మాత్రమే పంటలు వేశారు. వానకాలం సాధారణ సాగు విస్తీర్ణం 6.48 లక్షలు కాగా, జిల్లాలో ఈసారి 5.36 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటల సాగు చేశారు. లక్ష ఎకరాలకు పైగా సాగు తగ్గింది. హీరాబాద్ న్యాల్‌కల్, ఝరాసంగం, చౌటకూరు, సదాశివపేట, నారాయణఖేడ్‌లో పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. 14 మండలాల్లోని 50 గ్రామాల్లో పంటలు నీటమునిగి నష్టం వాటిల్లింది. వరి 71, సోయాబీన్ 815, మినుము 247, పెసర 68 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. కంది 250 ఎకరాలు, పత్తి 456 ఎకరాలు, చెరుకు 17 ఎకరాలు, కూరగాయలు 76 ఎకరాలు నష్టం వాటిల్లింది.